

విద్యార్థి సామర్థ్యాలను పరిశీలిస్తున్న దక్షిణామూర్తి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

బుధవారం 5 నవంబరు 2025

'చిక్కే'నా..!

ఖరీదైన 'గుడ్‌విల్'



- మద్యం షాపులకు విపరీతమైన డిమాండ్
- డ్రాలో దుకాణాలు రాని వ్యాపారుల ఆరాటం
- రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు 'డీల్'
- బిజినెస్‌లో పెద్దవంగర టాప్
- జిల్లా వ్యాప్తంగా 61 బ్రాందీ షాపులు

మహబూబాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం దుకాణాల లక్కీడ్రాలో ఎవరికి అదృష్టం వరించినా.. కాసుల వర్షమే.! సిరులు కురిపించే మెజారిటీ వైన్స్‌లపై పెత్తనం మాత్రం యథా లిక్కర్ వ్యాపారంలో రాటుదేలిన పాతకాపులకే చెల్లుతూ వస్తోంది. ఇది సుదీర్ఘకాలంగా మహబూబాబాద్ జిల్లాలో కొనసాగుతూ వస్తున్న.. బినామీలిక్కర్ సామ్రాజ్య అధిపతుల గుడ్‌విల్ దందా అంటే అతిశయోక్తి కాదు. రెండేళ్ల కిందట లిక్కర్ దుకాణాల లక్కీ డ్రా కోసం దరఖాస్తు ధర ఒక్కింటికి రూ.2 లక్షలు ఉండగా, ఈ సారి సర్కార్ ఆదాయం పెంచుకోవడానికి రూ.3 లక్షలకు పెంచింది. వీటికి తొలి రోజుల్లో నామమాత్రపు స్పందన కన్పించినప్పటికి చివరాఖరికి ప్రభుత్వం ఆశించిన ఆదాయం కొంత తగ్గినట్లు కన్పించడంతో దరఖాస్తు తేదీని పొడగించి మద్యంపై రావాల్సిన డిమాండ్‌ను సర్కార్ తెచ్చుకుంది.

ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే 61 మద్యం షాపులకు 1,792 దరఖాస్తులతో దాదాపు రూ.54 కోట్లు ఆదాయంగా ఖజానాకు చేరింది. ఎవరి పని వారు చేసుకున్నట్లు సర్కారీ ఆదాయం పెరిగింది. ఇక ఈ దుకాణాలపై పెత్తనం లక్కీడ్రాలో పాత కాపులు కొందరితో పాటు కొత్త వారికి అవకాశం లభించింది. ఇక్కడ పాతవారి మాట సరే.. వారే దుకాణాలు నిర్వహించుకునేందుకు సిద్ధం కాగా, కొత్తవారు మాత్రం ఈ వ్యాపారంపై అవగాహన లేక కొందరు ఉన్నా.. రిస్క్ ఎందుకని గుడ్‌విల్ పేరిట అమ్ముకునేందుకు మరికొందరు సిద్ధమయ్యారు. ఈ విషయం లిక్కర్ వ్యాపారులకు తెలియంది కాదు.. అందుకే గుడ్‌విల్‌కు అమ్ముకునే వారిని కాకపట్టి దుకాణాలను తమ కైవసం చేసుకునేందుకు అన్ని దారుల్లో ప్రయత్నాలు మొదలెట్టారు. ఈనెల 30తో పాత దుకాణాల గడువు ముగుస్తుంది. కొత్త దుకాణాలను డిసెంబర్ 1 నుంచి ప్రారంభించుకోవాలి. ఇంకేముంది బేరసారాలు ముమ్మరమయ్యాయి.

61 దుకాణాల్లో ఆదాయం తెచ్చేవి కొన్నే.!

మహబూబాబాద్ జిల్లాకు మునిసిపాలిటీలు, మండలాల వారీగా పరిశీలిస్తే అత్యధిక దుకాణాలు మునిసిపాలిటీల పరిధిలో 34 దుకాణాలు ఉండగా, మిగిలిన మండలాల పరిధిలో 27 షాపులు ఉన్నాయి. మద్యపాన ప్రియులు ఎక్కువగా మునిసిపాలిటీ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లోకే వచ్చి వెళ్తుండడం వల్ల ఈ దుకాణాల్లోనే ఎక్కువ వ్యాపారం కొనసాగుతుంది. ప్రధానంగా మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో 14, తొర్రూరులో 08, డోర్నకల్‌లో 03, మరిపెడలో 05, కేసముద్రం 04 దుకాణాలకు తోడు మండల కేంద్రాల్లోని దుకాణాల్లో భారీగా మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. దీనికి తోడు జిల్లా సరిహద్దు మండలాల్లో కూడ ఈ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా నడుస్తూ ఉంటుంది. ఇక జిల్లా కేంద్రాన్ని మినహాయిస్తే పెద్దవంగర మండలంలోని మద్యం షాపు విక్రయాలు జిల్లాలోనే అత్యధికంగా ఉన్నాయి. ఇక్కడ జనాభా ప్రాతిపదికన ఒకే ఒక్కషాపు ఉండడం, చుట్టూ 20 కిలోమీటర్ల వరకు అందుబాటులో మరోషాపు లేకపోవడంతో విక్రయాలు అధికంగా ఉంటాయంటున్నారు. జిల్లా సరిహద్దుకావడంతో పొరుగు జిల్లా నుంచి కూడా ఇక్కడి షాపునకు వినియోగదారులు వస్తుంటారు. ఆ తర్వాతి స్థానంలో వరుసగా దంతాలపల్లి మండలం, మరిపెడ, ఇనుగుర్తి, కేసముద్రం మండలాలు ఉన్నట్లు ఎక్సైజ్ అధికారుల నుంచి సమాచారం.

డిసెంబర్ 1వ తేదీ నుంచి..

జిల్లాలో వైన్స్‌లు దక్కించుకోవడానికి లక్షలాది రూపాయలు వెచ్చించి, తమకు ఆదాయం వచ్చే దుకాణాలు లక్కీడ్రాలో దక్కించుకోలేకపోయినా.. రాటు తేలిన మద్యం వ్యాపారులు ఈ సారి గుడ్‌విల్ పేరిట లక్కీడ్రా పొందిన వారి నుంచి గుడ్‌విల్ పేరిట తాము దుకాణాలు తీసుకోవడానికి పెద్ద ఎత్తున బేరసారాలకు దిగారు. ఒక అంచనా ప్రకారం.. పలు ప్రాంతాల్లో రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు షాపుకు'గుడ్‌విల్' ధర నిర్ణయిస్తూ కొనుగోలుకు ఇంకా ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని దుకాణాలు ఇప్పటికే బినామీల పేరిట రాటు తేలిన లిక్కర్ వ్యాపారులు తమ వశం చేసుకున్నారు.

డిసెంబర్ 1వ తేదీ నుంచి వీటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. వాస్తవానికి షాపు దక్కించుకున్న వారు రెండు నెలలకొకసారి రూ.9.16 లక్షల చొప్పున ఏటా రూ.55 లక్షల లైసెన్సు ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజులు కాకుండా సరుకు కోసం మరింత పెట్టుబడి అదనంగా వెచ్చించాల్సి ఉంటుంది. ఇవన్నీ కలుపుకొని అదనంగా రూ.లక్షల్లో గుడ్‌విల్ ఇస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా తాగేవాడే కడుతాడు తాళ్లపన్ను అన్న చందాన అన్ని ఖర్చులు మద్యం వినియోగదారులపైనే పరోక్షంగా పడుతాయనడం అతిశయోక్తి కాదు.

అకాల వర్షంతో అన్నదాత ఆగం

కేసముద్రం మార్కెట్లో వరదలో కొట్టుకుపోయిన మొక్కజొన్నలు



కేసముద్రం మార్కెట్లో వరదనీటిలో కొట్టుకుపోయిన రైతు అటికె నాగయ్యకు చెందిన మొక్కజొన్నలు



కేసముద్రం మార్కెట్లో తడిసిన మొక్కజొన్నలను చూపుతున్న రైతు రాజబోయిన యాదగిరి

కేసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిమిషాల వ్యవధిలోనే మంగళవారం ఉదయం కురిసిన అకాల వర్షంతో కేసముద్రం మార్కెట్లో అన్నదాతలు ఆగమయ్యా రు. అప్పటి వరకు సాధారణంగా ఉన్న వాతావరణ ఒక్కసారిగా మారిపోయి పది నిమిషాల పాటు కుండపోతగా వర్షం కురిసి ఆగిపోయింది. దీంతో ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్న వివిధ గ్రామాలకు చెందిన రైతుల మొక్కజొన్నలు వరద నీటిలో కొట్టు కుపోయాయి. తేమ శాతం తగ్గేందుకు నాలుగైదు రోజులుగా ఆరబెట్టుకున్న తమ మొక్కజొన్నలు తడిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలె తుఫానుతో వరి నేలవాలగా మొక్కజొన్నలు ఇలా తడిచిపోయి రెండు పంటలకు నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తడిచిన మొక్కజొన్నలను ఖరీదు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.



మానుకోట నెహ్రూసెంటర్‌లో ఉసిరికాయలు, ఆకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నేడు కార్తీక పౌర్ణమి

- ఆలయాలు, శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- దీపాలు వెలిగించి, పూజలు చేయనున్న మహిళలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ప్రజలు బుధవారం కార్తీకపౌర్ణమి వేడుకలను జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాలు, గ్రామాల్లో తెల్లవారుజామునే ఉసిరి, తులసి స్నానాలు ఆచరించి శివాలయాలకు భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అందుకు గాను ఆలయాల్లో అర్చకులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్తీక పౌర్ణమి పర్వదినాన 365 ఒత్తులను వెలిగిస్తే సంవత్సరమంతా శివుడికి పూజలు చేసినట్లుగా నానుడి ఉండడంతో మహిళలంతా శివాలయాల్లో దీపాలను వెలిగించేందుకు సిద్ధమయ్యారు.

శివాలయాలకు కార్తీక శోభ..

జిల్లా పరిధిలోని శివాలయాలు కార్తీకశోభను (మిగతా 6లో..)

బూత్ లెవల్ ఏజెంట్‌లను నియమించుకోవాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రానికి ఇద్దరు చొప్పున అన్ని రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్‌లను నియమించుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల విభాగం సిబ్బంది, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్‌లెవల్ ఏజెంట్‌ల నియామకంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాలు, సూచనల మేరకు జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని 267, మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో 288 పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవల్ ఏజెంట్‌లను నియమించుకోవాలన్నారు. అందుకనుగుణంగా ఎన్నికల సంఘం సూచనల ప్రకారం తమ ప్రతిపాదిత ఏజెంట్‌ల పూర్తి వివరాలను ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నీరుటి సురేష్‌నాయుడు, క్యాముపల్ శ్యాంసుందర్‌శర్మ, పిట్టల రామారావు, అజయ్‌సారథిరెడ్డి, సమ్మెట రాజమౌళి, కలెక్టరేట్ ఏవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

మరిపెడ : విద్యార్థులపై ఆయా పాఠశాలలు, గురుకులాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ మరిపెడలోని ఉన్నత, పీఎస్, గిరిజన సంక్షేమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, అలాగే మాకుల పెద్దచెరువు ఆధునీకరణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, న్యూట్రిషన్, శానిటేషన్ల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. పెరిగిన సాంకేతికను జోడించి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పోషక పదార్థాలను గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సక్రమంగా అందివ్వాలన్నారు. పెద్ద చెరువు ఆధునీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దారు కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ విజయానంద్, ఆర్ఐ శరత్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్



మహబూబాబాద్ క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మెగా స్పెషల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని, వివాదాస్పద కేసులను పరిష్కరించుకోవాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మంగళవారం సూచించారు. మహబూబాబాద్ జిల్లా కోర్టులో ఈనెల 4 నుంచి 15వ తేదీ వరకు మెగాస్పెషల్ లోక్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనిలో యాక్సిడెంట్ కేసులు, ఘర్షణ, ఛీటింగ్, వివాహబంధానికి సంబంధించిన కేసులు, దొంగతనం, ఇతర రాజీ కేసులకు సంబంధించిన తమ కేసులను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవచ్చన్నారు. ఫిర్యాదుదారుడు, నిందితుడు ఇద్దరూ తమ ఆధార్‌కార్డులను తీసుకొని కోర్టుకు హాజరు కావాలన్నారు. గొడవలు వద్దు.. రాజీలు ముద్దు, వివాదాలు పెంచుకుంటే జీవితకాలం కొనసాగుతాయి.. ఇంతటితో కలిసిపోదాం అనే నినాదంతో మెగా స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైస్తవుల సంక్షేమానికి సర్కార్ పెద్దపీట

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్



మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో మహబూబాబాద్ జిల్లా పాస్టర్స్ లేలీడర్స్ ఫెలోషిప్ (ఎండీపీఎల్ఎఫ్) ఆరో వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు ఎల్లప్పుడు కాంగ్రెస్ సర్కార్ అండగా నిలుస్తుందన్నారు. క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లివాటి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో క్రైస్తవుల సమాధుల స్థలం, కమ్యూనిటీ హాల్, చర్చిల నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. సీఆర్ఐఐ జాతీయ అధ్యక్షుడు కూచిపూడి బాబురావు, రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణపర్ బొజ్జా మాట్లాడుతూ క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. క్రైస్తవులు, చర్చిలపై జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎండీపీఎల్ఎఫ్ వ్యవస్థాపకుడు మల్లెపాక తిమోతి, జిల్లా అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి, శ్రావణ్, డేవిడ్, ప్రభుచరణ్, సామేల్, వెంకటరెడ్డి, జోసఫ్, జాన్ వెస్లీ, ప్రభుజీవన్, జాన్సన్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంచారామాల యాత్రకు ప్రత్యేక బస్సులు

తొర్రూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు నుంచి కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పంచారామాల దర్శనం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం పద్మావతి మంగళవారం తెలిపారు. తొర్రూరు డిపో నుంచి ఈనెల 9, 16న పంచారామాల దర్శనం కోసం అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు సూపర్ లగ్జరీ బస్సులు బయలు దేరుతాయన్నారు. భక్తుల కోసం 36 సీట్ల బస్సులు కూడా అందుబాటులో ఉన్నాయని, ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ ధర రూ.2,200లుగా నిర్ణయించడం జరిగిందని, కనీసం 30మంది భక్తులు నమోదైన తర్వాత బస్సు బయలుదేరుతుందన్నారు. మరిన్ని వివరాలకు 80744 74984, 99592 26053 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రవి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎస్టీయూ జిల్లా కమిటీ సభ్యులు

తొర్రూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రవి అన్నారు. మంగళవారం తొర్రూరు హైస్కూల్‌లో ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలు, సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, సర్వీస్ రూల్స్ సాధన, నగదు రహిత సేవలు, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ అంశాలు, 010 సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ అన్ని విధాల కృషి చేస్తుందని తెలిపారు. జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు.

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా గన్నోజు ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొరివి సుధాకరాచారి, కార్యదర్శిగా రమేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా యాకూబ్ రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా శకుంతలతో పాటు మరికొంత మందిని కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. యాకయ్య, శ్రీరాములు, మధుసూదన్, చంద్రమౌళి, శ్రీనివాస్, హరికృష్ణాచారి, వెంకన్న, యాకాంబ్రం తదితరులున్నారు.

నూతన వరివంగడాలతో అధిక దిగుబడులు

కేసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నూతన వరి వంగడాలతో ప్రతీకూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని అధిక దిగుబడులు సాధించవచ్చని హైదరాబాద్ రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు జ్యోతి బద్రి, సాయి ప్రసాద్, నీరజ, శ్రీధర్ సిద్ధి సూచించారు. మండలంలోని తాళ్లపూసపల్లిలో సాగు చేసిన నూతన వరి వంగడాలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కేతాన్ దేశీ, డీఆర్ఆర్ ధాన్ 75, డీఆర్ఆర్ ధాన్ 48, కేఎన్ఎన్ 12510, 7715 రకాల వరి అగ్గితెగులు, ఎండాకు తెగులు తట్టుకొని, పెట్టుబడులు తగ్గించి 129 రోజుల్లోనే దిగుబడులు వస్తుందని తెలిపారు. ఈ వంగడాలతో ఉత్పత్తి అయిన బియ్యంలో షుగర్ వ్యాధిగ్రస్తులకు అనుకూలంగా తక్కువ గ్లైసిమిక్స్ ఇండెక్స్ కలిగిఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో బి.వెంకన్న, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పౌర సరఫరాల జిల్లా అధికారి ప్రేమ్‌కుమార్

పెద్దవంగర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పౌర సరఫరాల జిల్లా అధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఐకేపీ ఇబ్బంది, పీఏసీఎస్, వ్యవసాయాధికారులలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కాకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. ప్రతి సెంటర్ వద్ద ఎలక్ట్రానిక్ మిషన్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే అధికారుల ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు అవసరయ్యే గన్నీ సంచుల వివరాలను ముందస్తుగానే జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. లారీల కొరత లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, పెద్దవంగర, తొర్రూరు తహసీల్దార్లు వీరగంటి మహేందర్, శ్రీనివాస్, ఎంపీడీవో వేణుమాధవ్, ఏవో గుగులోత్ స్వామి నాయక్, ఏపీఎం పాషా, ఆర్ లష్కర్, ఐకేపీ సిబ్బంది, ఏఈవోలు, సెంటర్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

యువత శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

తొర్రూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్‌కుమార్ తెలిపారు. మంగవారం మండలంలోని చెర్లపాలెం గ్రామంలో తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో (ఎన్ఎస్ఎస్) జాతీయ సేవా పథకం ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ రాములు అధ్యక్షతన ఏర్పాటు సమావేశం వారు మాట్లాడారు. నేటి యువతే దేశ భవిష్యత్ అన్నారు. శాస్త్రీయ ఆలోచనతో ముందుకు సాగితేనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు పరిశోధనాత్మక దృష్టిని పెంపొందించుకోవాలన్నారు. విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వాల్యానాయక్, సుజాత, రిటైర్డ్ ఎంఈవో మోహన్‌రెడ్డి, హెచ్ఎం తనూజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకేరులో ఇసుక దొంగలు

- తోడేస్తున్న ఇసుకాసురులు
- ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ వ్యాపారం
- ట్రాక్టర్ ట్రిప్పు ఇసుకకు రూ. 8 వేలు
- పట్టించుకోని అధికారులు


అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

నర్సింహులపేట(మహబూబాబాద్ క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆకేరు వాగులో ఇసుకాసురుల వేట యథేచ్ఛగా కొనసాగుతున్నది. వరద ఉధృతి ఉన్న దినసరి కూలీలకు అధిక రేటు ఎర చూపి ప్రమాద భరిత పరిస్థితుల్లోనూ ఇసుకను తోడేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొందరు ఇసుకాసురులు పట్టణాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని జయపురం, కౌసల్యదేవిపల్లి, ముంగిమడుగు, రామన్నగూడెం గ్రామాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ప్రతిరోజే పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను జిల్లా కేంద్రంతో పాటు, కురవి, కేసముద్రం తదితర పట్టణాలను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ. 7 వేలు నుంచి రూ. 8 వేల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో ఆకేరులో వరద ఉధృతి తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రమాదాన్ని లెక్క చేయకుండా వాగులో మునుగుతూ ఇసుకను తోడేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు
- రమేష్‌బాబు, తహసీల్దార్ నర్సింహులపేట

ఆకేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. ఈ మధ్య కాలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 20 ట్రాక్టర్లపై కేసు నమోదు చేశాం. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి ఓనర్లపై కేసులు నమోదు చేస్తాం.


హన్మంతరావుతో కాంగ్రెస్ నాయకులు

'జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం'

తొర్రూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని పీఏసీఎస్ ఛైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో పీసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు హన్మంతరావుతో భేటీ అయి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. యూసఫ్‌గూడ, జూబ్లీహిల్స్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ వస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతున్న నేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామసహాయం కృష్ణ కిషోర్ రెడ్డి, బిజ్జాల ప్రసాద్, మెరుగు మల్లేషం తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి

తొర్రూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు ఓటర్ నమోదు ఆన్‌లైన్ మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్య అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు అందరు వార్డుల పరిధిలో ఓటర్ నమోదు ఆన్‌లైన్ మ్యాపింగ్, ఐడీ డబుల్ మ్యాపింగ్‌లను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వారికి కేటాయించిన వార్డుల వారీగా వివరాలను త్వరగా పూర్తి చేసి నివేదిక అందించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీటీ నర్సయ్య

మునిసిపల్ కార్యాలయం ముట్టడి

భూపాలపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వాడల్లో కోతులు, కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాటి వేరొకచోటికి తరలించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. మునిసిపల్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి, అనంతరం విడుదల చేశారు. ఈ సంద ర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్, గురిజవెల్లి సుధాకర్‌రెడ్డి, కొరిమి సుగుణ మాట్లాడుతూ పట్టణంలో కోతులు, కుక్కలు ప్రజలపై నిత్యం దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో ఆస్పత్రుల చుట్టూ తిరిగి ఇంజక్షన్లు వేసుకుంటున్నారని అన్నారు. ఇంట్లో నుంచి బయటికి వెళ్లాలంటే తీవ్ర భయాందోళనకు గురికావాల్సి వస్తోం దని అన్నారు.

ఈ విషయంపై పలుమార్లు మునిసిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని విమర్శించారు. పైగా కోతులు, కుక్కల నివా రణకు నిధులు సైతం మంజూరుచేసి వాటిని పట్టుకోకుండానే నిధులు కాజేశారని ఆరోపించారు. ఇప్పటి కైనా కోతులు, కుక్కలను వెంటనే పట్ట ణం నుంచి బయటికి పంపించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నూకల చంద్రమౌళి, మాతంగి రామచందర్, పల్లె కృష్ణ, జోసెఫ్, రమేష్, గంప రాజు, పెదమాముల్ సంధ్య, శ్రీలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న సీపీఐ నాయకులు, పట్టణ ప్రజలు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భూపాల పల్లి జిల్లా కాటారం మండలం గంగారంలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. చీర్ల రాజయ్య, గౌరక్క దంపతుల కుమారుడు చీర్ల దేవేందర్(33) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం దేవేందర్ తన ఇంటి వద్ద ఉన్న కరెంట్ మోటార్ ఆన్ కాకపోవడంతో వైర్లను సరిచేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై పడిపోయాడు. చుట్టుపక్కల వారు వచ్చేసరికి మృతి చెందాడు. మృతుడి తల్లి గౌరక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

అన్నారం బ్యారేజీలో మృతదేహం లభ్యం

మహదేవపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీ తీర ప్రాంతంలో ఓ మృతదేహం లభ్యమైంది. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణానికి చెందిన రావికంటి సాయికృష్ణ (30) సోమవారం మంథని వద్ద గోదావరిలో గల్లంత య్యాడు. సోమవారం నుంచి అతడి ఆచూకీ కోసం గాలించగా మంగళవారం అన్నారం బ్యారేజీ వద్ద మృతదే హం లభ్యమైంది. మృతదేహాన్ని మంథని పోలీసులకు అప్పగించారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

వాజేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి ములుగు జిల్లా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు ఎస్పీ శబరీశ్ వెల్లడించారు. వాజేడు మండలంలోని బొమ్మనపల్లికి చెందిన సోడి సందీప్ అనే వ్యక్తిపై 2022లో పోక్సో కేసు బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై హరీశ్ నమోదు చేశారు. ఈ కేసును మొదటి దర్యాప్తు అధికారిగా అశోక్ కుమార్, రెండో దర్యాప్తు అధికారి సంకీర్త్ వ్యవహరించారు. కోర్టులో కేసు నడుస్తున్న క్రమంలో మంగళవారం తీర్పు వెలువడింది. సోడి సందీప్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 9 వేల జరిమానాను విధించారు. నిందితుడికి శిక్ష పడే విధంగా కృషి చేసిన పీపీ రాంసింగ్, సీడీవో నాగరాజును ఎస్పీ అభినందించారు.

23న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉచిత విద్య
మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న కాలేజీ చైర్మన్ వేణుగోపాల్ గౌడ్

హనుమకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అగ్రగామి విద్యా సంస్థ అయిన రాజస్థాన్ కోట మోషన్ ఐఐటీ, నీట్ కాలేజీలో ఈ నెల 23న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. మంగళవారం హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ జూనియర్ కళాశాలలో మోషన్ టా లెంట్ సెర్చ్ ఎగ్జామ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ టాలెంట్ టెస్టులో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని టాలెంట్ టెస్టు రాసే విద్యార్థుల్లో ఉత్తమ ర్యాం కులు సాధించిన పది మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ రాసే విద్యార్థులలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య, రూ.2.50 కోట్ల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

నీట్ వరంగల్ సెంటర్ నుంచి టాలెంట్ టెస్టులో మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థులలో మొదటి ర్యాంకు విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండవ ర్యాం కు సాధించిన విద్యార్థికి ట్యాబ్ ఇవ్వనున్నట్లు ఈ అవకాశాన్ని ఈ సంవత్సరం పదో తరగతి చదువుతున్న స్టేట్ సీబీఎస్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్యాలెంట్ టెస్టు రిజిస్ట్రేషన్ కోసం సెల్ నంబర్:97030 00850 లో సంప్రదించాలన్నారు.

కార్యక్రమంలో మోషన్ కాలేజీ బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, ఏజీఎం శనిగరపు సుమన్, ఏవో తాళ్లపెల్లి రమేష్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ సభ్యులు సురేందర్, తాళ్లపెల్లి వెంక ట్, రావుల రవీందర్, ఒంటేరు మనోహర్, బోడ సంతోష్, జి. అనిల్, రంజిత్, కాలేజీ సిబ్బంది లక్ష్మణ్, మౌనిక, ఉమ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూర్వ ప్రాథమిక పాఠశాలలో బోధకులు, ఆయా పోస్టుల భర్తీకి ఈ నెల 7లోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీఎస్ జయ్యారం ప్రీప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్, ఆయా కోసం ఇంటర్ పాసై ఉండాలన్నారు. స్థానికులు మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు. 18నుంచి 44ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వయస్సు సడలింపు ఉందన్నారు. బోధకులకు రూ.8 వేలు, ఆయాలకు రూ.6 వేల గౌరవ వేతనం ఉంటుందని పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్


నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దవంగర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములుగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరచారి మాట్లాడుతూ తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలులో ఎటువంటి జాప్యం లేకుండా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అదించాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మండల కేంద్రంలో బస్ షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణం, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6న జనగామ జిల్లాలో ఏర్పాటు చేసిన 24 గంటల నిరాహార దీక్షలో బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్, వెంకన్న, సుధాకర్, కిరణ్, గణేష్, బాలు, ప్రసాద్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలి


గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ రాజేందర్

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సౌర విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల మేనేజర్ జి. రాజేందర్ అన్నారు. జిల్లాలోని నర్సింహులపేట గ్రామ ప్రత్యేక అధికారి కిన్నెర యాకయ్య అధ్యక్షతన మోడల్ సోలార్ విలేజి గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తి బిజిలీ యోజన పథకంలో నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం, నర్సింహులపేట గ్రామాలను మోడల్ సోలార్ విలేజీలుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ గ్రామాల్లో వంద శాతం సోలార్ వినియోగమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనిలో ఒక కిలోవాట్‌కి రూ. 30 వేలు చొప్పున సబ్సిడీతో పాటు బ్యాంకు రుణ సదుపాయం ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వర్లు, సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ నవీన్‌కుమార్ యాదవ్, ప్రజలు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

తొర్రూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు ఇట్టె సోమారెడ్డి కోరారు. ఈనెల 7న పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో నిర్వహించే నిరసన దీక్ష పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలు, బకాయిలు, డీఆర్‌లు, 2023 నుంచి పీఆర్సీని అమలు పరుస్తూ వాటి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 7న హైదరాబాద్ ధర్నా చౌక్‌లో జరిగే నిరసనకు పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. యాకూబ్, వీరభద్రయ్య, ఉల్లి విశ్వనాథచారి, విజయ్‌కుమార్, యాకయ్య, బాలాజీ, రాములు ఉన్నారు.

వెంకన్న హుండీల లెక్కింపు

ఆదాయం రూ. 2.16 లక్షలు


హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నర్సింహులపేట మండల కేంద్రం శివారులోని ఇంద్రకీలాద్రి పర్వతంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయం హుండీల ఆదాయం రూ. 2.16 లక్షలు వచ్చినట్లు ఆలయం ఈవో వెంకట్రావ్ మంగళవారం తెలిపారు. ఈవో తెలిపిన వివరాల ప్రకారం.. పరిశీలకుడు ఎం అనిల్, ఆలయ చైర్మన్ వి. విజయ్ పాల్‌రెడ్డి పర్యవేక్షణలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు ఐదు హుండీలను లెక్కించగా 2,16,840 సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మార్క శేఖర్, అర్చకులు నందనాచార్యులు, రామాచార్యులు, ధర్మకర్తలు మధుసూదన్, డి.రాము, గ్రామ పెద్దలు జి రమేష్, అశేష్‌రాజు, విష్ణువర్ధన్, రాములు, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మరిపెడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మరిపెడ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వీరభద్రరావును యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని ఆయన శాలువాతో సత్కరించారు. విజయ్ వెంట కాంగ్రెస్ నాయకుడు భూక్యా కృష్ణ తదితరులు ఉన్నారు.



రామప్ప ఐలాండ్ నమూనా

రామప్ప సరస్సులో స్మృతివనం ఎప్పుడో?

- రూ.90 కోట్లతో ఏర్పాటుకు మంత్రి జూపల్లి హామీ
- ముందుకు పడని అడుగు

వెంకటాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్పపై రాష్ట్ర పర్యాటకశాఖ చిన్నచూపు చూస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాక్షాత్తు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రామప్పను గత ఆగస్టులో సందర్శించిన సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలాయి. శివుడి విగ్రహం హామీపై ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల అటు పర్యాటకులు, ఇటు భక్తులు శివశివా... నీవైనే మాట తప్పారంటూ గుసగుసలాడుకుంటున్నారు. అంతర్జాతీయ స్థాయి పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నా ఆస్థాయిలో అభివృద్ధి జరగ డంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రామప్ప సరస్సు ప్రాంతంలో కాకతీయ కళారూపాలను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా సరస్సు మధ్యలోని ఐలాండ్‌లో భారీ శివలింగం, చెరువు కట్టపై శివుడి విగ్రహం, ధ్యాన మందిరం, పిల్లల కోసం శివుడి విగ్రహంతో ద్వీపం ఆధ్యాత్మికత సంతరించుకునేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, పర్యాటకశాఖ అధికారులకు సూచించినప్పటికీ ఇప్పటికీ ఫలితంలేదు.

భక్తులు సందర్శించుకునేందు కు వీలుగా రోప్‌వే నిర్మాణం చేపడతామని మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటకశాఖ అధికారులకు చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఆహామీ నీటమూటగానే మిగిలింది. రూ.90 కోట్లతో ఏర్పాటు చేస్తామన్న స్మృతివనం స్థలం ఇప్పటికీ శూన్యంగానే దర్శనమిస్తోంది. రామప్ప ఆలయ పరిసర ప్రాంగణంలో ప్రసాద్‌స్కీంలో భాగంగా అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

కానీ, సరస్సు ప్రాంతంలో రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.



ఐలాండ్‌లో ఏర్పాటుచేసే భారీ శివుడి విగ్రహం నమూనా



గృహ సిలిండర్ల మాయాజాలం

- వ్యాపార సంస్థలకు అక్రమంగా తరలింపు...
- బడా హోటళ్ల నుంచి చిరు వ్యాపారాల వరకు ఇష్టారాజ్యంగా వాడకం
- తనిఖీలే చేపట్టని అధికారులు

గ్యాస్ ఏజెన్సీల కక్కుర్తి

హనుమకొండ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లు చిరు వ్యాపార సంస్థలకు తరలుతున్నాయి. సివిల్ సప్లయిస్ అధికారులు, కొన్ని గ్యాస్ ఏజెన్సీల కంపెనీలకు ఈ విధానం కాసులు కురిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ దందా నిరాటంకంగా సాగుతోంది. యధేచ్ఛగా డొమెస్టిక్ సిలిండర్లు కమర్షియల్ రంగాలకు తరలుతున్నాయి. ఇదంతా బాహాటంగానే గ్యాస్ సిలిండర్లు వ్యాపార సంస్థలకు చేరుతున్నాయి. చిరు వ్యాపార సంస్థల వినియోగం అందరికి కనిపించే దృశ్యమే. ఇంత విచ్చలవిడిగా దందా జరగడానికి సివిల్ సప్లయిస్ అధికారుల దురాశే. సిలిండర్ల తరలింపును అడ్డుకోరు. తనిఖీలు చేయడరు. ప్రజలు ఎవరైనా ప్రమాద అంశమై ఫిర్యాదు చేసినా జాన్ తా నహీ అంటూ తాపీగా ఉంటారు. గ్యాస్ ఏజెన్సీల నుంచి నెల వారిగా ముట్టాల్సిన మామూళ్లు చేతిలో పడితే చాలు ఏమైతే మాకేంటి ధోరణితో అధికారులు ఉన్నారు. మరో వైపు గ్యాస్ ఏజెన్సీలు కూడా అధికారుల అండతో అక్రమంగా సిలిండర్లను తరలిస్తూ అడ్డదారిలో దోచుకుంటున్నారు.

బడా హోటళ్ల నుంచి...

హనుమకొండ జిల్లాలోని బడా హోటళ్లు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కర్రీ పాయింట్లు ఇలా గ్రామ, మండల, నగరంలోని ప్రధాన జంక్షలు ఇతర చోట్ల టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్ల వ్యాపారాలు ఇతర చిన్నా చితక వ్యాపార సెంటర్ల యజమానులు డొమెస్టిక్ సిలిండర్లకు కమర్షియల్‌కు వినియోగిస్తున్నారు. ఈ విధానం నిబంధనలకు పూర్తి విరుద్ధం. వ్యాపార సంస్థలు కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలి. విరుద్ధంగా వ్యవహరిస్తే సివిల్ సప్లయిస్ అధికారులు కేసులు బనాయిస్తారు. అంతే కాదు నోటీసులు జారీ చేసి సీజ్ కూడా చేయవచ్చు. ప్రజా ప్రయోజనాల రీత్యా ఈ చర్యలు తీసుకుంటారు. కమర్షియల్ సిలిండర్లు నీలి రంగుతో ఉంటాయి. సిలిండర్ బరువు 19 కేజీలు. ఇక గృహ వినియోగ సిలిండర్లు రెడ్ కలర్‌తో ఉండి 14.2 కేజీల బరువుతో ఉంటాయి. ఇలా ఏ విభాగంలోని సిలిండర్లు ఆ మేరకే వినియోంచాల్సి ఉంటుంది.

మామూళ్ల మత్తు

హనుమకొండ జిల్లాలోని ఫుడ్ వ్యాపార రంగాల యజమానులు సివిల్ సప్లయిస్ అధికారులకు పెద్ద ఎత్తున మామూళ్లు అందచేస్తున్నారు. ఈ కారణంగా అధికారులు కమర్షియల్ సిలిండర్ల అక్రమ తరలింపును పట్టించుకోకుండా దందా సాఫిగా సాగేలా ఊతమిస్తున్నారు. నీలి రంగు సిలిండర్లను వినియోగం చిరు వ్యాపారాల సంస్థల్లో అయితే కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. గమనించిన వారు ఎవరైనా ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించరు. తనిఖీలు చేయరు. కేసుల నమోదు లేదు. ఇక కొందరు డొమెస్టిక్ కస్టమర్లు, సబ్సిడీ లబ్దిదారులు దురాశ కూడా దందాకు సహాయంగా మారింది. ప్రభుత్వం అందచేస్తున్న సబ్సిడీ సిలిండర్లను డబ్బులకు ఆశపడి గ్యాస్ ఏజెన్సీలకు సహకరిస్తున్నారు. డబ్బులు రావడంతో ఒకే కుటుంబంలోని వారు వేరు వేరుగా కూడా గ్యాస్ కనెక్షన్లు పొంది ఈ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారు.

గీత దాటుతున్న వినియోగం...


డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్లకు వేరు వేరుగా సెఫ్టీ మెజర్స్ ఉంటాయి. గ్యాస్ స్టవ్, పైప్, రెగ్యులేటర్ తదితరమైనవి వేటి కవే వేరుగా రూపొందించడం జరుగుతుంది. డొమెస్టిక్ విభాగంలోని సిలిండర్లను విరుద్ధంగా వినియోగిస్తే పేలుడు సంభవించడానికి అవకాశాలు ఉన్నట్లే. ఇది తెలిసినా వ్యాపారులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పేలుడు జరిగితే ప్రాణ నష్టంతో పాటు భారీ ఆస్తి కూడా ఉంటుంది. పైగా చుట్టూ పక్కల ఉన్న భవనాలు, ఇతర వ్యాపార రంగాలకు కూడా ప్రమాదం పొంచి ఉన్నట్లే. ఇంత ప్రమాద స్థితి నెలకొన్నప్పటికీ అధికారులు, గ్యాస్ ఏజెన్సీల కంపెనీలు కాసులకు కక్కుర్తి పడి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. ఇక మరింత ప్రమాదకరమైన అంశం ఏమిటంటే....డొమెస్టిక్ సిలిండర్‌లోని గ్యాస్‌ను వ్యాపారులు ఏమాత్రం సురక్షితం కానీ పద్ధతిలో పైపుల ద్వారా కమర్షియల్ సిలిండర్లకు పంపింగ్ చేస్తున్నారు.

నేడే కందికొండ జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారగణం
- వేలాదిగా తరలిరానున్న భక్తజనం

కురవి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని కురవి మండలంలోని కందిగిరి పర్వతంపై నర్సింహా స్వామి, లక్ష్మీదేవిల జాతర బుధవారం జరగనుంది. ఇందుకోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జాతరకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని భక్తులు వేలాదిగా హాజరవుతారు. రెండు కిలోమీటర్లకుపైగా ఎత్తులో ఉన్న గుట్టపైకి ఎక్కేందుకు సరైన దారి, మెట్లులేకపోవడంతో భక్తులు రాళ్లు, రప్పలు ముళ్ల పొదల నుంచి పర్వతాన్ని అధిరోహించి స్వామివారిని దర్శించుకొంటారు.

జాతర కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్ సీఐ కరుణాకర్, తహసీల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబులు కొద్ది రోజులుగా కందికొండ గుట్టను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జాతర కోసం తొర్రూరు డీఎస్పీ ఆధ్వర్యంలో మరో డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 17 మంది ఎస్సైల ఆధ్వర్యంలో మొత్తం 160 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీరోలు ఎస్సై గండ్ర సంతోష్ తెలిపారు. దొంగతనాల నివారణకు సీసీఎస్ టీమ్‌లు, ఈవ్‌టీజర్ల అదుపునకు సివిల్ డ్రెస్సుల్లో ఉన్న షీ టీమ్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భక్తులకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో నీటివసతి, నాలుగు చోట్ల ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు రవాణా కోసం మహబుబాబాద్ బస్ డిపో కందికొండకు స్పెషల్ బస్సులను నడుపనుంది.



కురవి మండలంలోని కందికొండ ఆలయంపై వెలిగించనున్న అఖండ దీపం



కందికొండ ఆలయంపై లక్ష్మీనర్సింహాస్వామి విగ్రహం

కల్యాణోత్సవం

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణమహోత్సవాలు బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే మొదలవుతాయి. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, మంగళాశాసనములు గావించి కల్యాణ మహోత్సవాన్ని ఉదయంసమయాన్నే పూర్తిచేస్తారు. ఆపై భక్తులు స్వామివారిని దర్శించుకొంటారు.

అఖండజ్యోతి

సాయంత్రం సమయంలో మట్టి మూకుడులో కంది కొండ ఆలయంపై భాగాన అఖండజ్యోతిని వెలిగిస్తారు. ఈ మూకుడు నిండా నూనెపోసి, వస్త్రంతో మడతవేసి పెద్ద వత్తిగా చేసి వెలిగిస్తారు. ఈ దీపంలో నూనెను కందికొండ గ్రామానికి చెందిన ముస్లింలు అందించడం విశేషం. తరతరాలుగా ముస్లింలు నూనెలు అందించడం ఆచారంగా వస్తోంది. ఈ అఖండజ్యోతి చుట్టు పక్కల అనేక కిలోమీటర్ల వరకు కనిపిస్తుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

రెండు రోజుల్లో పంట నష్టం నివేదిక అందజేయాలి

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు సంబంధించిన పంట నష్టం అంచానా నివేదిక రెండు రోజుల్లో అందజేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగర్, వేలేరు మండలాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్టాలపై శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కడియం సమీక్ష నిర్వహించారు. ధర్మసాగర్, వేలేరు మండలాల్లో భారీ వర్షాలతో వివిధ పంటలు, పశు సంపద, రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్న వివరాలను ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు, పంట నష్ట వివరాల నమోదు, తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ.. పంట నష్టం అంచనాలో అధికారులు నిబంధనలు పక్కన పెట్టి రైతులకు అనుకూలంగా వ్యవహరించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చేపట్టిన సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. భారీ వర్షాలు మరో రెండు, మూడు రోజులు ఉన్న నేపథ్యంలో ధర్మసాగర్ రిజర్వాయర్ గేట్లు ఎత్తాలన్నారు.

క్లౌడ్ బరస్ట్ వరంగల్‌లోనే చూపిస్తున్నందున రిజర్వాయర్ గేట్స్ నుంచినీటి విడుదల చేయాలన్నారు. కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ.. పంటలు, రోడ్లు, పశు సంపద నష్టంపై సంబంధిత శాఖల అధికారుల అంచనాలను త్వరగా అందజేయాలన్నారు.పాక్షికంగా, పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు ప్రతిపాదనలుఅధికారులు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారాం, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టి మోసం

రూ. 10 లక్షలతో ఉడాయించిన ముఠా

కాటారంలో లబోదిబోమంటున్న కిరాణా షాపు యజమాని

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారు కొనుగోలు చేసి మోసపోయాడు ఓ కిరణా షాపు యజమాని. అర కిలో బంగారం రూ. 15 లక్షలకే ఇస్తామని నమ్మబలికిన ఓ ముఠా, అడ్వాన్స్‌గా రూ. 10లక్షలు తీసుకొని ఉడాయించింది. ఈ ఘటన భూపాలపల్లి జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. కాటారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలికి సమీపంలో ఉన్న కిరాణా షాపునకు రెండు వారాల క్రితం ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు వచ్చి సరుకులు కొనుగోలు చేశారు. తాము కూలి పనుల నిమిత్తం వచ్చామని చెప్పారు. ఆ తర్వాత మరో రోజు కూడా అదే దుకాణానికి వచ్చి సెల్‌ఫోన్ రీచార్జ్ చేయించుకున్నారు. మాటల సందర్భంగా షాపు యజమానితో తమకు ఒక చోట బంగారం దొరికిందని, దాన్ని తక్కువ ధరకే అమ్ముతామని చెప్పారు.

దీంతో ఆశ పడ్డ కిరాణా షాపు యజమాని బంగారం తీసుకొచ్చి తనకు చూపించమని అడిగాడు. వారు బంగారం ముద్ద నుంచి చిన్న ముక్కను కట్ చేసి తెచ్చామంటూ దాన్ని ఆ వ్యాపారికి ఇచ్చారు. దీంతో అతడు నగలు తయారు చేసే వారికి దాన్ని చూపించడంతో అది ఒరిజనల్ బంగారమని వారు తేల్చారు. దీంతో సంబరపడ్డ కిరాణా షాపు యజమాని ఆ నలుగురితో బేరమాడాడు. ఈ క్రమంలో షాపు వద్ద ఉన్న సీసీ కెమెరాలను ఆ వ్యక్తులు ఆఫ్ చేయాలని సూచించారు. బంగారాన్ని రూ. 15 లక్షలకు ఇవ్వడానికి ఒప్పుకున్న ముఠా సభ్యులు అడ్వాన్స్‌గా రూ. 10లక్షలు వ్యాపారి నుంచి తీసుకున్నారు. మూడు రోజుల్లో మిగతా డబ్బులు ఇస్తానని అతడు చెప్పడంతో అంగీకరించారు. ఆ ముఠా వద్ద నుంచి తీసుకున్న బంగారాన్ని అదే రోజు రాత్రి వ్యాపారి మరోసారి పరిశీలించగా అది నకిలీ బంగారమని తేలింది. దీంతో లబోదిబోమన్న అతడు పోలీసులను ఆశ్రయించాడు. బంగారం పేరుతో తాను మోసపోయానని చెప్పలేక, తన గల్లా పెట్టె నుంచి ఎవరో ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశాడు.

దీంతో రూ. 10 లక్షలు గల్లా పెట్టె నుంచి పోవడమేమిటని పోలీసులకు అనుమానం వచ్చింది. నిజమేమిటో చెప్పమని ఆ వ్యాపారిని పోలీసులు గట్టిగా అడగ్గా అసలు విషయం చెప్పి భోరుమన్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసిన పోలీసులు కాటారం నుంచి కాళేశ్వరం వరకు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించినట్టు తెలిసింది. నకిలీ బంగారం ముఠా మహారాష్ట్ర వైపు వెళ్లిందని సమాచారం. ఈ ఘటనపై పోలీసులు వివరాలు వెల్లడించలేదు.

కలకలం రేపిన 'ఇసుకాసుర'

- అక్రమాలపై ఇంటిలిజెన్స్ వర్గాల ఆరా
- చర్చనీయాంశంగా మారిన 'ఆంధ్రజ్యోతి' కథనం

వాజేడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాల్లో అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం వెలువడిన ఇసుకాసుర కథనం కలకలం రేపింది. జిల్లాలోని ఓ ప్రధాన ముఖ్య అధికారి కనుసన్నల్లో జిల్లా, మండల అధికారుల అన్ని రకాలుగా మభ్య పెడుతూ ఈ దందా సాగుతుందని వెలుగులోకి రావడంతో చర్చనీయంశంగా మారింది. ఇసుకాసుర కథనంతో ఇసుక అక్రమార్కుల గుండెల్లో రైల్లు పరిగెడుతున్నాయి. అక్రమంగా ఇసుక తోలకాలు జరుపుతున్న ఇసుక మాఫియా పై ఇంటిలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి.

టెండర్లు వేసిన ఇసుక క్వారీల్లో కాకుండా మరోక చోట ఇసుక తవ్వకాలు జరుపుతూ రూ. కోట్లలో దండుకుంటున్న అక్రమార్కులపై ఇంటిలిజెన్స్ విచారణ చేస్తున్నట్లు సమాచారం. అదే విధంగా గతంలో రద్దు చేసిన క్వారీలకు అనుమతులు ఇవ్వడంపై కూడా అనుమానాలు వస్తుండటంతో టీజీఎండీసీ అధికారుల పాత్ర ఎంత ఉందని చర్చ మొదలైంది. ములుగు, భూపాలపల్లి జిల్లాలో రూ. 200 కోట్లకు పైగా ఇసుకను అక్రమార్కులు దోచుకోవడంతో ఈ ఇసుక తవ్వకాల్లో ఎవరి పాత్ర ఎంత ఉంది అనే చర్చ అన్ని వర్గాల్లో మొదలైంది. ఈ ఇసుక తవ్వకాల్లో చక్రం తిప్పుతున్న అధికార పార్టీకి చెందిన కీలక నేత పాత్ర పై కూడా కాంగ్రెస్ శ్రేణులు, అధికారులలో చర్చ మొదలైంది. ములుగు జిల్లాలో 10 ఇసుక క్వారీల్లో, భూపాలపల్లి జిల్లాలోని 5 క్వారీల్లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని ఇప్పటికే విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో టీజీఎండీసీ అధికారుల్లో భయం మొదలైందని టాక్ వినిపిస్తుంది. ఇసుక అక్రమార్కులకు అండగా నిలుస్తున్న టీజీఎండీసీ అధికారుల ఉదాసీనతపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


గతంలో జరిమానా

వెంకటాపురం మండలంలోని రామచంద్రాపురం ఇసుక క్వారీలో గతంలోజరిగిన విధంగానే ప్రస్తుతం బోదాపురం-2 ఇసుక ర్యాంపులో అక్రమాలు కొనసాగుతున్నాయి. మైనింగ్ శాఖ నుండి ఎండీఎల్ అనుమతి లేకపోవడంతో రామచంద్రాపురం ర్యాంపుకు అప్పటి కలెక్టరు కృష్ణ ఆదిత్య జరిమానా విధించారు. కానీ ఇప్పుడు బహిరంగంగా అక్రమాలు చోటు చేసుకుంటున్నా జిల్లా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో కవితా సంపుటి వేలం

రూ.42వేలకు దక్కించుకున్న యువతి

వరంగల్ కల్చరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక గ్రామానికి చెందిన బొంపెల్లి శ్రీనివాస్ అనే యువకుడు తొలిసారిగా రచించిన కవితా సంకలనం 'నా దాహం.. ప్రపంచం'కు ఆన్‌లైన్‌లో విశేష స్పందన వచ్చింది. మన దేశ కరెన్సీ ప్రకారం రూ.42వేలకు అమెరికాలో నివసిస్తున్న మిర్యాలగూడకు చెందిన మైలవరపు అఖిల అనే యువతి మొదటి పుస్తకాన్ని కొనుగోలు చేశారు. తెలంగాణ పబ్లికేషన్స్ హైదరాబాద్ వారు ముద్రించిన ఈ పుస్తకాన్ని ఆదివారం రాత్రి అమెరికాలో ఆన్‌లైన్ కవి బొంపెల్లి శ్రీనివాస్ స్నేహితులు, అభిమానులు ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టారు. ఈ పోటీలో అఖిల అనే యువతి రూ.42వేలకు కొనుగోలు చేయడం గమనార్హం. త్వరలోనే ఈ పుస్తకాన్ని దేశంలోని పాఠకులందరికీ ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తెస్తామని శ్రీనివాస్ స్నేహితులు తెలిపారు. ఈ సందర్భంగా కవి శ్రీనివాస్ తల్లిదండ్రులు బొంపెల్లి దేవేందర్‌రావు లక్ష్మీ, శ్రీనివాస్ స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.



బొంపెల్లి శ్రీనివాస్ రాసిన నా దాహం.. ప్రపంచం పుస్తకం

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

● డీఈవో దక్షిణామూర్తి

బయ్యారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించే విధంగా బోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) దక్షిణామూర్తి ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కేంద్రప్రాథమిక పాఠశాల (సీపీఎస్)ను ఆయన ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల్లోని ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థినిని నుంచి బోర్డుపై రాసిన సరళ పదాలను రాబట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే డీఈవో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలను కూడా తనిఖీ చేశారు. వచ్చే వార్షిక పరీక్షలకు పదో తరగతి విద్యార్థులను సమాయత్తపర్చాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

రిలే దీక్ష వెనుక ప్రతిపక్ష 'హస్తం'..

● అరాచకాలు చేసే వాళ్లే దీక్షకు మద్దతు
● పీఏసీఎస్ మాజీ చైర్మన్ మధుకర్‌రెడ్డి

బయ్యారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్‌రెడ్డి బయ్యారంలో కొద్ది రోజులుగా చేపడుతున్న రిలే దీక్ష వెనుక పలువురు ప్రతిపక్ష పార్టీ నేతలతో పాటు కాంగ్రెస్‌కు చెందిన కొంతమంది నేతల హస్తం ఉందని ఆ పార్టీ నాయకులు, బయ్యారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి ఆరోపించారు. బయ్యారంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ముఠా రాజకీయాలతో అరాచకాలకు పాల్పడే పలువురు నేతలు దీక్షకు మద్దతు తెలపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇతర పార్టీల ప్రోద్బలంతో దీక్ష చేపడుతున్న శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రభుత్వాన్ని బలహీన పరిచేవిధంగా స్థానిక ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయటం విచారకరమన్నారు. గత


బయ్యారంలో మాట్లాడుతున్న మధుకర్‌రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే శ్రీనివాస్‌రెడ్డి కొత్త కాంగ్రెస్.. పాత కాంగ్రెస్ అంటూ నేతల నడుమ చీలకలు తీసుకొచ్చే విధంగా సమావేశాలు ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గంజాయి నిందితులకు వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తూ పార్టీ ప్రతిష్ఠతను దిగజార్చే విధంగా శ్రీనివాస్ రెడ్డి ప్రవర్తించడం మూలంగానే కాంగ్రెస్ నేతల నడుమ ఘర్షణ నెలకొన్నట్లు పేర్కొన్నారు. అయినప్పటికి తనపై హత్యాప్రయత్నం దాడి జరిగిందని శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టిన పోలీసులు చట్ట ప్రకారం సంబంధిత బాధ్యులపై చర్యలు కూడా చేపట్టిందని వెల్లడించారు. గ్రామశాఖ స్థాయి వ్యక్తి ఎమ్మెల్యేను విమర్శిస్తే పైశాఖలు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా దీక్షకు మద్దతిచ్చే వారు అసలు విషయాలను గ్రహించాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ కూడా చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, ముసలయ్య, లక్ష్మీ, రాము నాయక్, సుధాకర్ నాయక్, రవినాయక్, బాబా, నాగేశ్వరరావు, వెంకటపతి, రమేష్, నర్సయ్య, ఉపేందర్, వెంకన్న, సుమన్, రాకేష్, భద్రం తదితరులు పాల్గొన్నారు.

10న ఆంగ్లం, చరిత్ర పోస్టుల భర్తీకి డెమో

ఇనుగుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో తాత్కాలిక పద్ధతిన పీజీటీ ఇంగ్లీష్, జూనియర్ లెక్చరర్ చరిత్ర బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 10న ఉదయం 11 గంటలకు డెమోకు ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలతో నేరుగా హాజరుకావాలని ప్రిన్సిపాల్ జి.జయశ్రీ మంగళవారం కోరారు. బీఈడీతో పాటు ఆంగ్ల ఉపాధ్యాయురాలికి ఎంఏ ఇంగ్లీష్, చరిత్ర ఉపన్యాసకురాలి పోస్టునకు ఎంఏ చరిత్ర అర్హతలు ఉండాలని తెలిపారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్

ఇనుగుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ డిమాండ్ చేశారు. రాముతండాలో మంగళవారం ఆ సంఘం అనుబంధ హమాలీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికుల నూతన కమిటీ అధ్యక్షుడిగా బానోత్ చంద్రు, కార్యదర్శిగా బానోత్ రమేష్, ఉపాధ్యక్షుడిగా ఇస్లావత్ రమేష్, కోశాధికారిగా అజ్మీర శ్రీను, సహాయ కార్యదర్శిగా గుగులోత్ శ్రీనివాస్, బానోత్ లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు.

'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కో-ఆర్డినేటర్ రాంపాక సుధాకర్ అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే శీతకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి, రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని చెప్పారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ప్రతీ సంవత్సరం రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం మొదటి సంవత్సరంలో రూ.9200 కోట్లు కేటాయించి అందులో కేవలం రూ.2,068 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి లక్ష్మీశ్రీనివాస్, మంగలంపల్లి రాజ్‌కుమార్, రాయల రమేష్, పెండ్యాల బాబు, డొనక ఐలయ్య, కొమ్ము ఎల్లయ్య, రాజా, నరేష్‌కుమార్, పురుషోత్తం పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నేతలు

కబ్జాకు గురైన కుంటలు, భూములపై విచారణ జరిపిస్తాం

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ


అధికారులతో మాట్లాడుతున్న లెనిన్‌వత్సల్ టొప్పొ

డోర్నకల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ రెవెన్యూ పరిధిలో కబ్జా కు గురైన కుంటలు, భూములపై విచారణ జరిపిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ అన్నారు. మంగళవారం డోర్నకల్ మునిసిపల్ పరిధిలోని కొర్లకుంట (మారెమ్మ కుంట)ను రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్, పంచాయతీ రాజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల కొందరు వ్యక్తులు కొర్లకుంట తమ భూమిలోనే ఉందని పేర్కొంటూ, పట్టా తమపేరుపైనే ఉందని, కొర్లకుంట కట్టను తొలగించి లోతట్టు ప్రాంతాన్ని చదును చేశారు. దీంతో ఈనెల 30న మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి కొర్లకుంటకు వెళ్లే వరద నీరు రైల్వేట్రాక్‌పై నుంచి ప్రవహించడంతో సిగ్నల్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడి రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రైళ్లు ఆగిపోవడంతో కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, ఆర్డీవో కృష్ణవేణి హుటాహుటిన డోర్నకల్‌కు వచ్చి రైల్వేస్టేషన్‌లో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం రైల్వే డీఆర్ఎం డోర్నకల్ రైల్వేస్టేషన్‌ను సం దర్శించారు. పట్టాలపై నీరుచేరి రైళ్లు నిలిచిపోవడంతో ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన రైల్వేశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారి ఆదేశాల మేరకు డోర్నకల్‌కు వచ్చిన అదనపు కలెక్టర్ కబ్జాకు గురైన కొర్లకుంటను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాత రెవెన్యూ రికార్డుల ప్రకా రం విచారణ జరిపించి కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ నిరంజన్, ఇరిగేషన్ ఏఈ కిషన్, రైల్వే అధికారి అఖిల్‌లు ఉన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గంగారం మండలం దుబ్బగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు పవన్ కల్యాణ్, సందీప్, రాజేంద్రప్రసాద్ రాంమూర్తి, రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మర్రిగూడెం కేంద్రంగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే రైతులకు రవాణా ఖర్చు పెరుగుతుందని, వారి ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని దుబ్బగూడెం జీపీ పరిధిలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో మొక్కజొన్న పంటను సుమారు 1800 ఎకరాల్లో సాగు చేశారని మక్కల కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు.

ఉద్యమకారులపై అక్రమ కేసులు


మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్

మహబూబాబాద్ టౌన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయించారని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ ఆరోపించారు. భూపోరాట కేసులో మహబూబాబాద్ జిల్లా కోర్టుకు మంగళవారం సీపీఐ నాయకులు కుమార్, రేషపల్లి నవీన్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సామ పాపయ్య, పోచారం కృష్ణ మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా పెరుగు కుమార్ మాట్లాడుతూ ప్రజల తరపున పోరాడిన ఉద్యమకారులపై నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. మహబూబాబాద్ శ్రీరాంనగర్ బీసీ కాలనీలో కేంద్రచిన్నతరహా పరిశ్రమల శాఖ సెంట్రల్ ఇనిస్టూట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ ఉచిత శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ ప్రతీ చిన్న విషయానికి కుటుంబంపై ఆధారపడకుండా తమ కాళ్ల మీద తాము నిలబడేలా కుట్టుమిషన్ శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గంవర్క్‌తో పాటు పేయింట్, జూట్ బ్యాగుల తయారీలో పూర్తి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈశిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దైవకృప వెల్ఫేర్ సొసైటీ బాధ్యులు బానోత్ లోకేష్, నవిత, కృష్ణవేణి, భారతమ్మ, గౌతమి, స్వప్న, మల్లమ్మ, స్పందన, జ్యోతి, అనిత, విజయ, సుమలత, ఉమ, నీలమ్మ, శ్రావణి, అనూష, శైలజ, అర్చన పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల ప్రారంభంలో మాట్లాడుతున్న శంతన్ రామరాజు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్


తండాలో ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న రాజేశ్వర్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మునిసిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 11వ వార్డు పరిధిలోని భవానీనగర్ తండాలో మంగళవారం పర్యటించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండా సమీపంలోని స్మశానవాటిక చుట్టూ కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా చెత్తవేసి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చుట్టూ ఫినిషింగ్ తిప్పాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. స్మశాన వాటికలో నిరుపయోగంగా ఉన్న బోరింగ్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి, మాజీ కౌన్సిలర్ భూక్య లక్ష్మి, తండా వాసులు గుగులోతు సక్క, భూక్య దాసు, బోడ రమణ, స్వామి, లాలు, నగేష్, శ్రీను, రవి, మంగిలాల్, సంతోష్, నాగ, లాలు పాల్గొన్నారు.

'సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాలి'

కురవి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. లింగ్యాతండాలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి కొనుగోలు కేంద్రాలలో స్లాట్ బుకింగ్‌ను రైతులు బుక్ చేసుకోవడం రాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని అప్పగించిందని విమర్శించారు. ఈ సందర్భంగా లింగ్యాతండా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇస్లావత్ సంతు, కార్యదర్శిగా లావుడ్యా అచ్చాలి, సభ్యులుగా బాదావత్ రెడ్డి, రూప్లా, కిషన్, శంకర్, వీరన్న, పండరీ, హత్తిరాం, బాలు, చంద్రులను ఎన్నుకున్నారు.


లింగ్యాతండాలో మాట్లాడుతున్న నల్లపు సుధాకర్

చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 7న పాఠశాల స్థాయిలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను మండలంలోని కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆ వేదిక మండల అధ్యక్షుడు చిర్ర యాకాంతంగౌడ్, ప్రధాన కార్యదర్శి, హెచ్ఎం బండారు నరేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన, శాస్త్రీయదృక్పథం పెంపొందించేందుకు ఈ టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెస్ట్ జిల్లా కన్వీనర్ సురేష్, పీఎస్ హెచ్ఎం కళ్లెం వీరారెడ్డి, గనె యాదగిరి, చందర్, మోహనకృష్ణ, సదానందం, రాజేంద్రాచారి, రాములు, నాగేందర్, అలి, గనె పావన, పార్వతి, రాధ పాల్గొన్నారు.

కల్వర్టు వద్ద కూరుకుపోయిన లారీ


కల్వర్టుపై దిగబడిన లారీ

డోర్నకల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని డోర్నకల్-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై మైనార్టీ బాలికల పాఠశాల వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టుపై ఓ లారీ కూరుకుపోయింది. గత రెండ్రోజులుగా పైపులతో కల్వర్టు నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ అధికారులు చేపట్టారు. ఈ క్రమంలో మహబూబాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ కల్వర్టుపైకి చేరుకున్న వెంటనే లారీ చక్రాలు మట్టిలో దిగబడిపోయాయి. దీంతో ఆ మార్గం మీదుగా ప్రయాణించే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. ఉదయం ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని బయటకు తీశారు.

నేడు కార్తీక పౌర్ణమి

(3వ పేజీ తరువాయి)


దీపాంతలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సంతరించుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు భారీగా వచ్చి పూజలు చేయనుండడంతో ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్తీక పౌర్ణమి రోజున శివుడిని పూజిస్తే సుఖ సంతోషాలతో పాటు అష్టఐశ్వర్యాలు తులతూగుతాయని భక్తుల విశ్వాసం. జిల్లా కేంద్రంలోని పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయం, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, ఉమాచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయం, భక్తమార్కండేయ దేవాలయం, గాయత్రిమాత దేవాలయం, జిల్లా కేంద్రం శివారు అనంతాద్రి స్వయంభూ వేంకటేశ్వర స్వామి దేవాలయాలను కార్తీక పౌర్ణమి వేడుకలకు సన్నద్ధం చేశారు.

మానుకోటలో కొనుగోళ్లు

కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందు మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో చిరువ్యాపారులు ఉసిరికాయలు, ఆకులు, మామిడి ఆకులు, బంతిపూలు, దీపాంతలను ఏర్పాటు చేసి విక్రయించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పెద్దఎత్తున ఉసిరి కాయలు, ఉసిరి ఆకులు, దీపాంత లు, బంతి పూలను కొనుగోలు చేశారు.

చేతి సంచులు పంపిణీ

గార్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలైన ఆరు గ్యారంటీ పథకాల సంబంధించిన గుర్తుల ఉన్న చేతి సంచులను మంగళవారం గుంపెళ్లగూడెం రేషన్‌షాపులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అందనాల రాజీవ్ నాయుడు మాట్లాడారు. పేదల అభ్యున్నతి కోసం ప్రజా పాలన ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తుందని, దీన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాన్సీసాగర్ బాబు, ఎద్దు లక్ష్మయ్య, సిద్ధబోయిన జనార్దన్, కడియాల కోటేశ్వరరావు, యాకుబ్, చింత కృష్ణ, డీలర్ వట్టం రవి కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు టై, బెల్ట్‌ల పంపిణీ

గార్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలోని 120 మంది విద్యార్థినులకు మంగళవారం టైబెల్ట్‌లు పంపిణీ చేశారు. ఎస్ఆర్ఐ రెబ్బా శ్రీనివాస్ అందించిన సహకారంలో ఉపాధాయయులతో కలిసి రూ.10వేలు విలువ చేసే టై బెల్ట్‌లను అందచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దేవులపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు మాచర్ల సుందర్ కుమార్, ఎం.వెంకటేశ్వర్లు, మంజులా, సురేందర్‌రెడ్డి, వెకటేశ్వరరెడ్డి, నరసింహస్వామి, ఎండీ అబ్దుల్లా, ఎడ్ల అప్పయ్య మంగయ్య, లావణ్య, అశ్విని, బాలయ్య పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి'


సాగుపై అవగాహన కలిస్తున్న సొసైటీ చైర్మన్ దుర్గాప్రసాద్

గార్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించి, అధిక లాభాలు పొందాలని సొసైటీ చైర్మన్ దుర్గాప్రసాద్ కోరారు. మంగళవారం గార్ల సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ పంటలపై మక్కువ పెంచుకొని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించ వచ్చునన్నారు. ఆసక్తి ఉన్న రైతులకు 100 శాతం రాయితీలపై మొక్కలను అందచేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కేసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లిలో మంగళవారం పిచ్చికుక్క దాడి చేసి కరవడంతో బైరు రాజుతోపాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇదే కుక్క రెండు దూడలను, మేకలను కరిచింది. గాయపడిన రాజు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.



ధర్నా నిర్వహిస్తున్న డీఎస్ఎఫ్ఐ నాయకులు

ఎంఈవోను తొలగించాలి

కురవి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సీరోలు ఎంఈవో లచ్చిరాంనాయక్‌ను విధుల నుంచి, సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం కురవిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో గుగులోతు శివవర్మ మాట్లాడారు. లచ్చిరాం తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజల అవసరాల కోసం వేయాల్సిన సీసీ రోడ్డును సొంత కోళ్లఫాంకు వేసుకున్నాడని విమర్శించారు. సీసీ రోడ్డును కంబాల సంపత్ భూమిలో అక్రమంగా వేసి అతన్ని, అతని తండ్రిని బెదిరించడంతో సంపత్ మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని పేర్కొన్నాడు. లచ్చిరాంనాయక్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సురేష్, రవి, అనిల్, సంపత్, సంతోష్, సునీల్, నగేష్, భరత్, చంటి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కొత్తగూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ మోడల్ స్కూల్లో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 7న పాఠశాల స్థాయిలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆ వేదిక మండల అధ్యక్షుడు డాక్టర్ పులుసం సాంబయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంఈవో లక్ష్మీనారాయణ, ఏసీఎంవో రాములు, హెచ్ఎంలు ధరావత్ సారయ్య, గట్టి ఆదిలక్ష్మి, రేగా పాపయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ మండల బాధ్యులు

రేపు మోటార్ సైకిళ్ల బహిరంగ వేలం

పాలకుర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మోటార్ సైకిళ్లను 6న బహిరంగ వేలం వేస్తున్న ట్లు పాలకుర్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.సంతోష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 6న మండల కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో వలు కేసుల్లో పట్టుబడిన నాలుగు మోటార్ సైకి ళ్లను బహిరంగ వేలం ద్వారా విక్రయి స్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

హోరెత్తిన అయ్యప్ప, శివ నామస్మరణ


పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప, శివ దీక్షాపరులు

మరిపెడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం సందర్భంగా మరిపెడ బంగ్లాలోని అయ్యప్పస్వామి, మల్లికార్జునస్వామి ఆలయంలో అయ్యప్ప, శివ దీక్షాపరులు మంగళవారం భజనలు, నగర సంకీర్తనలతో హోరెత్తించారు. అర్చకుడు బుక్కమఠం నవీన్‌కుమార్ దేవతమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దీక్షాపరులకు ఆ ఆలయాల నిర్వాహకులు అన్నదానం చేశారు.

ధాన్యాన్ని, పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సోమన్న

పాలకుర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తుపాన్‌కు తడిసిన ధాన్యాన్ని, పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చిట్యాల సోమన్న ఆధ్వర్యంలో మంగళవారం పాలకుర్తి తహసీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం అందచేశారు. సోమన్న మాట్లాడుతూ ఎకరానికి రూ.50 వేలు, పత్తికి ఎకరానికి రూ.70 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తి, వరి పంటలకు ఎక్కువగా నష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకన్న, భాస్కర్, సమ్మయ్య, రాంచంద్రు, తోట రాజు, పెద్దపురం, కరీమ్ ఉన్నారు.